క్లుప్తంగా

మీడియా అకాడమీ నుంచి రూ.లక్ష ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న అల్లం నారాయణ

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం బొల్లంపల్లి గ్రామానికి చెందిన ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ తులసీదాస్ ఇటీవల ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు పడి మృతిచెందాడు. బాధిత కుటుంబానికి మీడియా అకాడమీ నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తులసీదాస్ భార్య విజయకు అందజేశారు. అదేవిధంగా వారి కుమార్తె చదువుకు ప్రతినెలా రూ.1,000 చొప్పున 10వ తరగతి వరకు ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జనరల్ సెక్రటరీ మారుతీ సాగర్, జిల్లా అధ్యక్షుడు వజ్జె వీరయ్యయాదవ్ పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



సీమంతం నిర్వహిస్తున్న క్లబ్ సభ్యులు

భానుపురి (సూర్యాపేట): సూర్యాపేట పట్టణంలో బుధవారం లయన్స్ ఆఫ్ సూర్యాపేట స్ఫూర్తి క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణిలకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్ పర్సన్ గండూరి కృపాకర్, 20వ వార్డు కౌన్సిలర్ అన్నెపర్తి రాజేష్, లయన్స్ క్లబ్ ఆఫ్ సూర్యాపేట స్ఫూర్తి అధ్యక్షురాలు బీరవోలు హైమావతి, ట్రెజరర్ విజయలక్ష్మి, చార్టర్ ప్రెసిడెంట్ ఇరిగి కోటేశ్వరి, రోజా, కేతిరెడ్డి పద్మ, కోనా అండాలు, నిర్మల, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



విద్యార్థులకు ఆర్థికసాయం అందించి సన్మానిస్తున్న సత్యనారాయణ, నర్సయ్య

అర్వపల్లి: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయులు తబిత అన్నారు. పాఠశాలలో గతేడాది పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాలకు చెందిన 1970–71 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు పిల్లలమర్రి సత్యనారాయణ, చింత నర్సయ్యలు రూ.15 వేల ఆర్థిక సాయాన్ని బుధవారం అందించారు. అదేవిధంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో తన్నీరు బాలయ్య, ఎల్లెంల కొమిరెల్లి, చెనగాని వీరయ్య, పద్మనాభస్వామి, కర్నాటి రంగయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులను పట్టించుకోని బీఆర్‌ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్ర

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట): బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ముదిరాజులకు అసెంబ్లీ టికెట్ ఇవ్వకుండా అన్యాయం చేశారని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు చెక్కల వీరభద్ర ఆరోపించారు. బుధవారం ఆత్మకూరు మండల పరిధిలో ఏర్పాటు చేసిన సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న స్థానాల్లో అయినా ముదిరాజులకు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ ప్రధాన కార్యదర్శి చిలువేరు సుధాకర్, అధికార ప్రతినిధి సిరికొండ సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు జంగా వెంకటేశ్వర్లు, కొరివి సైదులు, కార్యదర్శి గంగరబోయిన శ్రీను, దొండ ఎల్లయ్య, శ్రీను, రాజు, మల్సూర్, లింగయ్య, రవి, లింగయ్య పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సమంజసం కాదు

భానుపురి (సూర్యాపేట): హైదరాబాద్‌లో దళిత బిడ్డపై అత్యాచారం జరిగితే నిరసన తెలుపుతున్న వారిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరైంది కాదని బహుజన సమాజ్ పార్టీ సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు గట్టు గోపి అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్‌లో గల అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బహుజన సమాజ్ పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో జరిగిన అన్యాయం గురించి మాట్లాడితే దోషులను శిక్షించకుండా నిరసన తెలిపే వారిపై పోలీసులు ప్రతాపం చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో లక్కపాక సైదులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

‘చంద్రయాన్‌- 3’ సంబరాలు

- విక్రమ్ ల్యాండింగ్ దృశ్యాలను వివిధ మాధ్యమాల ద్వారా వీక్షించిన విద్యార్థులు



సూర్యాపేటలో సంబరాలు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన చంద్రయాన్ –3 ప్రయోగం విజయవంతం కావడంతో జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించారు. చంద్రుడి దక్షిణ ధ్రువం మీదకు విక్రమ్ ల్యాండర్ చేరిన దృశ్యాలను వీక్షించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు సంబంధిత ఆన్‌లైన్ లింకును షేర్ చేశారు. పలు రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, హాస్టళ్లలో విద్యార్థులు టీవీల ద్వారా ల్యాండింగ్ దృశ్యాలు తిలకించారు. ఇస్రో సైంటిస్టుల కృషి దేశానికే అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈసందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

విద్యార్థుల కేరింతలు..

తిరుమలగిరి (తుంగతుర్తి): చంద్రుడిపై చంద్రయాన్ –3 విక్రమ్ ల్యాండింగ్ దృశ్యాలను వీక్షించేందుకు బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక ప్రొజెక్టర్లు, టీవీలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు వీక్షించారు. చంద్రునిపై చంద్రయాన్- 3 ల్యాండర్ సేఫ్‌గా ల్యాండ్ అవడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ సంబరాలు చేసుకున్నారు.



తిరుమలగిరి: విక్రమ్ ల్యాండింగ్ దృశ్యాలను టీవీలో వీక్షిస్తున్న విద్యార్థులు

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సంబరాలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ –3 ప్రయోగం విజయవంతం కావడంతో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సూర్యాపేటలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవ సంఘం తెలంగాణ ప్రాంత ప్రచారక్ శ్రీధర్ మాట్లాడుతూ చంద్రుడి దక్షిణ ధ్రువంపై మొదటిసారిగా చంద్రయాన్ – 3 కాలు మోపడం ద్వారా భారత్ ప్రపంచ చరిత్ర పుటల్లోకి ఎక్కిందన్నారు. కార్యక్రమంలో నాగవల్లి ప్రభాకర్, రామినేని శ్రీనివాస్, నాగరాజు, మంత్రి ప్రగడ శ్రీధర్, దశరథ, సత్తిరెడ్డి, సంధ్యారాణి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి కలుగుతుంది



చంద్రయాన్ –3 విజయవంతం కావడం పట్ల సంతోషంగా ఉంది. ఇలాంటి దృశ్యాలు చూడటం ద్వారా సైన్స్ పట్ల విపరీతమైన ఆసక్తి కలుగుతుంది. ప్రపంచంలోనే భారతదేశం గొప్ప స్థాయికి చేరుకుంది.

– గౌతమ్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, జయ కళాశాల, సూర్యాపేట

శాస్త్రవేత్తగా ఎదగాలనేది నా లక్ష్యం



చంద్రయాన్ –3 విజయవంతం కావడం ఎంతో సంతోషంగా ఉంది. మా పాఠశాలలో టీవీ ద్వారా ల్యాండ్ అయ్యే దృశ్యాలను వీక్షించాం. చాలా ఆనందం ఉంది. శాస్త్రవేత్తల వల్ల దేశానికి గొప్ప కీర్తి ప్రతిష్టలు వచ్చాయి. శాస్త్రవేత్తగా ఎదగాలనేది నా లక్ష్యం.

– సాయికుమార్, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, సోషల్ వెల్ఫేర్, సూర్యాపేట

గొప్పరోజుగా భావిస్తున్నా



చంద్రయాన్ –3 చంద్రుడిపై ల్యాండ్ కావడంతో ఈ రోజు గొప్ప రోజుగా భావిస్తున్నా. నేను భారతీయుడిగా పుట్టినందుకు గర్విస్తున్నా. ఈ ప్రాజెక్టు కోసం ఏళ్ల తరబడి కష్టపడ్డ సైంటిస్టుల కృషి ఫలించింది.

– సాయిచరణ్, పదో తరగతి, సోషల్ వెల్ఫేర్ పాఠశాల, సూర్యాపేట

దేశానికి గొప్ప కీర్తి ప్రతిష్టలు వచ్చాయి



ప్రపంచ దేశాలు ఎంతో ఉత్కంఠతో చూస్తున్న చంద్రయాన్ –3 విజయవంతం కావడం పట్ల దేశానికి గొప్ప కీర్తి ప్రతిష్టలు వచ్చాయి. ఇండియా డెవలప్ కంట్రీ అని చెప్పుకోవడానికి ఇదొక నిదర్శనం. చంద్రయాన్ –3 సక్సెస్ కావడంతో భారతీయుడిగా గర్వంగా ఉంది. టీవీలో చూస్తున్నంత సేపు ఎంతో ఆనందం అనిపించింది.

– వి.లిఖిత, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, జయ కళాశాల, సూర్యాపేట



ప్రొజెక్టర్ ద్వారా వీక్షిస్తున్న విద్యార్థులు

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న శ్రీకాంత్

దురాజ్‌పల్లి (సూర్యాపేట): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్ వర్మ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బానోత్ వినోద్ నాయక్, తాళ్ల వినయ్, క్రాంతి, అరుణ్, గోపి, వేణు, లెనిన్, నాని తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

నూతనకల్: మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా బుధవారం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ముత్యాలమ్మతల్లికి జలాధివాసం నిర్వహించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించాలి

సూర్యాపేట రూరల్: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, సంపద వనాలు, పండ్ల తోటల పెంపకం వంటి పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. శ్మశాన వాటికల్లో నీటి కొరత లేకుండా చూడాలని చెప్పారు. హరితహారంలో భాగంగా మొక్కలు పెంచాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ పరంకుశరావు, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం మండల అధ్యక్షుడిగా రాజు

తిరుమలగిరి (తుంగతుర్తి): తిరుమలగిరి మండల వడ్డెర సంఘం నూతన అధ్యక్షుడిగా కొణిదెల రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండల కేంద్రంలో వడ్డెర సంఘం కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్, కార్యదర్శిగా యాదగిరి, గౌరవ అధ్యక్షుడిగా శివరాత్రి రాజు ఎన్నికయ్యారు.

పాఠశాలల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

నూతనకల్: విద్యా, ఉపాధ్యాయ రంగాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్ కోరారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో పీఆర్‌టీయూ సంఘం సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతరెడ్డి రామలింగారెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మహేశ్వరం వెంకటయ్య, మేడిపల్లి శ్రీనివాస్, ధరావత్ శివయ్య, చౌగాని వెంకయ్య గౌడ్, కాసర్ల వీరారెడ్డి, ఇరుగు సోమయ్య, ఇంద్రారెడ్డి, ఉప్పు నాగయ్య, నవేందర్‌రెడ్డి, సైదులు సుధాకర్, రమేష్‌రెడ్డి, కందుకూరు శివశంకర్, ఎడవెల్లి శ్రీనివాస్, వీరన్న నాయక్, పళ్ల వెంకటయ్య, కోన వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, కోన జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు

సూర్యాపేటటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఏఐఎస్‌ఎఫ్ అనేక పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కొనపర్తి యశ్వంత్, గడ్డం నాగరాజు, యాకన్న, కాసాని నరేష్, అనూష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వకు ‘భీమిరెడ్డి’ పేరు పెట్టాలి



మాట్లాడుతున్న నాయకులు

నాగారం: ఎస్సారెస్పీ రెండవ దశ కాలువకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు పెట్టాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం నాగారం మండల పరిధిలోని ప్రగతి నగర్ ఎస్సారెస్పీ కాలువ భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి ఘాట్ వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సారెస్పీ కాలువకు శంకుస్థాపన చేయించి, గోదావరి జలాలను తుంగతుర్తి నియోజకవర్గానికి తీసుకువచ్చిన గొప్ప నాయకుడు భీమిరెడ్డి నరసింహారెడ్డి అని కొనియాడారు. కాల్వకు భీమిరెడ్డి నరసింహారెడ్డి పేరు నామకరణం చేసే వరకూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాస్కుల మట్టయ్య, జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, నల్లగొండ జిల్లా కార్యదర్శి సైదమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు గోపి కాశి, తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు రమేష్, వీర పాపయ్య, సుధీర్, పెద్ద నరసయ్య తదితరులు పాల్గొన్నారు.


వెనుకబడిన వారిని ఆదుకోవడమే ట్రస్ట్ లక్ష్యం



పుస్తెమెట్టెలు అందజేస్తున్న దయాకర్‌గుప్త

భానుపురి (సూర్యాపేట): భావితరాలకు మన సనాతన ధర్మాన్ని తెలియజేయడంతోపాటు ఆర్థికంగా వెనుకబడిన వారిని ఆదుకోవడమే సదాచార్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ కన్వీనర్ దయాకర్‌గుప్త అన్నారు. కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి చెందిన ముస్కు వెంకన్న, రేణుకల కుమార్తె త్రిష వివాహం సందర్భంగా సూర్యాపేటకు చెందిన మిర్యాల శివకుమార్, కవిత దంపతుల సహకారంతో బుధవారం పట్టణంలోని ట్రస్ట్ సేవా మందిరంలో మంగళసూత్రం, మెట్టెలు, నూతన దుస్తులు అందజేశారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారి కుమార్తెల వివాహాలకు దాతల సహకారంతో రాష్ట్ర వ్యాప్తంగా 83 మందికి పుస్తె మెట్టెలు ఇచ్చామని, అందులో సూర్యాపేట జిల్లాలోనే 50 మంది వధువులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సదాచార్ ట్రస్ట్ సభ్యులు విజయలక్ష్మి, బచ్చు పురుషోత్తం, వైఎల్‌ఎన్‌గౌడ్, దార జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యాదవ యుద్ధభేరి సభ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



నూతనకల్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం నాయకులు

అర్వపల్లి: హైదరాబాద్‌లో ఈనెల 25న జరిగే యాదవుల యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం జాజిరెడ్డిగూడెంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పులిచెర్ల శ్రీరాములు, ఉపసర్పంచ్ వల్లాల రమేష్, ఎల్లెంల కొమిరెల్లి, బయ్యన్న, నరేష్, లింగమల్లు, పాక వీరేష్, ఆంజనేయులు, పోలెబోయిన మధుకర్, మల్లేష్, సైదులు, మల్లయ్య, యాదయ్య, లింగయ్య, అజాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్: హైదరాబాద్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న యాదవ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని యాదవ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. సభకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి యాదవులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జటంగి గణేష్, మట్టపల్లి రాములు, జటంగి సందీప్, బయ్యా రవి, జటంగి లింగస్వామి, గుండాల శ్రీశైలం, బొల్క గణేష్, నేరేళ్ల దేవదాస్, ఎల్లెంల పరమేష్ పాల్గొన్నారు.

పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన



నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నూతనకల్: పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర నాయకుడు చింత రామయ్య కోరారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో పెన్షనర్ల సంఘం కార్యాలయ భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెన్షనర్లకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు సమకూర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా ఇన్‌చార్జ్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, ఏలేటి నారాయణరెడ్డి, బందు కృష్ణయ్య, తీగల గిరిధర్‌రెడ్డి, తండు సత్యనారాయణ, బాషనపల్లి మల్లయ్య, జి. హన్మంతరావు, ఆలగడప సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య అన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే నివాసం ముట్టడికి వెళ్తున్న ఆ పార్టీ నాయకులను తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో దీన్‌దయాళ్, యాదగిరి, హనుమంతు, బంగ్రరాజు, సోమన్న, బాలకృష్ణ, సుభాష్‌రెడ్డి, లింగయ్య, కుమార్, నాగరాజు, యాకూబ్ పాల్గొన్నారు.

తుంగతుర్తిలో హ్యాట్రిక్ విజయం సాధిస్తా

- ఎమ్మెల్యే కిశోర్‌కుమార్



అర్వపల్లి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

అర్వపల్లి: సీఎం కేసీఆర్ ఆశీర్వాదం, నియోజకవర్గ ప్రజల దీవెనలతో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. తుంగతుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్‌ఎస్ టికెట్ ప్రకటించిన అనంతరం బుధవారం తొలిసారిగా అర్వపల్లి దేవాలయానికి వచ్చిన ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆయనను గజమాలతో సన్మానించారు. దేవాలయంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాలయం నుంచి మెయిన్ రోడ్డు వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగాలంటే తనను మళ్లీ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ హామీలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మన్నె రేణుక, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి, సర్పంచ్ సునీత, కనుకు శ్రీనివాస్, దేవాలయ చైర్మన్ విద్యాసాగర్, జిల్లా నాయకులు మొరిశెట్టి ఉపేందర్, కడారి నరేష్, మార్కెట్ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి మూడోసారి ఆశీర్వదించాలి

నాగారం: తుంగతుర్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి మూడోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ కోరారు. బుధవారం అర్వపల్లి, నాగారం మీదుగా తిరుమలగిరి వరకు చేపట్టిన బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు.

తుంగతుర్తి గడ్డపై గులాబీ జెండా ఎగరాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తుంగతుర్తి గడ్డమీద గులాబీ జెండా ఎగుర వేయాలని ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. బుధవారం తిరుమలగిరిలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో విద్య, వైద్యం, రోడ్లు అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, త్వరలోనే తుంగతుర్తిలో వంద పడకల ఆస్పత్రికి మంత్రి హరీశ్‌రావుతో శంకుస్థాపన చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రైతు బంధు సమితి అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతి, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, తిరుమలగిరి పట్టణ శాఖ అధ్యక్షులు యాదగిరి, భాస్కర్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలు విజయవంతం చేయాలి

తిరుమలగిరి (తుంగతుర్తి): ఆగస్టు 29, 30వ తేదీల్లో జలాల్‌పురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న పాఠశాల స్థాయి క్రీడాపోటీలు విజయవంతం చేయాలని మండల విద్యాధికారి శాంతయ్య కోరారు. బుధవారం మండల విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, అశోక్, వెంకట్, బాలరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

29, 30న మండల స్థాయి క్రీడా పోటీలు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో 29, 30వ తేదీల్లో మండల స్థాయి పాఠశాలల క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాలునాయక్ బుధవారం తెలిపారు. 29న బాలికలకు, 30న బాలురకు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

కల్నల్ సంతోష్ బాబు త్యాగం మరువలేనిది



సంతోష్‌బాబు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పుదుచ్చేరి ఎమ్మెల్యే అశోక్ బాబు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): కల్నల్ సంతోష్ బాబు దేశం కోసం చేసిన త్యాగం మరువలేనిదని పుదుచ్చేరి ఎమ్మెల్యే అశోక్ బాబు అన్నారు. బీజేపీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆయన వారం రోజుల పర్యటనలో భాగంగా సూర్యాపేటకు వచ్చారు. బుధవారం నియోజకవర్గ నాయకులతో కలిసి కల్నల్ సంతోష్ బాబు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం కార్గిల్ అమరుడు గోపయ్య చారి కుటుంబ సభ్యులను సన్మానించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సంకినేని వరుణ్, కర్నాటి కిషన్, సలిగంటి వీరేంద్ర, మల్సూర్ తదితరులున్నారు.

సూర్యక్షేత్రంలో పూజలు

అర్వపల్లి: తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రాన్ని బుధవారం పుదుచ్చేరి ఎమ్మెల్యే అశోక్‌బాబు సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర విశిష్టతను క్షేత్ర వ్యవస్థాపకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్‌రావు, సూర్యాపేట నియోజకవర్గ కన్వీనర్ కర్నాటి కిషన్, పార్టీ మండల అధ్యక్షుడు వెన్న శశిధర్‌రెడ్డి, గజ్జల వెంకట్‌రెడ్డి, ఉప్పు శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలు లేక ఇక్కట్లు

- నూతన పంచాయతీల్లో కానరాని రేషన్ షాపులు
- సరుకులు తెచ్చుకునేందుకు పక్క గ్రామాలకు
- ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు



నాగారంబంగ్లాలో రేషన్ బియ్యం తీసుకుంటున్న పేరబోయినగూడెం లబ్ధిదారుడు (ఫైల్)

నాగారం: నూతన గ్రామపంచాయతీల్లో రేషన్ దుకాణాలు లేకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని గ్రామాల ప్రజలు కిలోమీటర్ల దూరం ప్రయాణించి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. మరోవైపు మారుమూల గ్రామాలకు, తండాలకు రవాణా సదుపాయాలు లేక కాలినడకన, కిరాయి వాహనాల్లో వెళ్లి సరుకులు తెచ్చుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన జిల్లాలు, మండలాలతో పాటు గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. 500 మంది జనాభా దాటిన గ్రామాలను ప్రభుత్వం నూతన జీపీలుగా మార్చింది. ఈక్రమంలో గ్రామాల్లోనే రేషన్ దుకాణాలు ఏర్పాటు చేస్తామని చెప్పింది. కానీ నేటికీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో కార్డు దారులు పక్క గ్రామాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాగారం మండలంలోని పేరబోయినగూడెంతో పాటు ఆవాస గ్రామామైన కంచుగట్లగూడెం, నర్సింహులగూడెంతో పాటు సర్వానాయక్‌తండా, దుబ్బతండా, మాణిక్యతండాలకు చెందిన ప్రజలు ప్రతినెలా నాగారంబంగ్లాకు వచ్చి రేషన్ బియ్యం తీసుకోవాల్సి వస్తోంది. అదేవిధంగా శాంతినగర్, బీమ్లా తండాలకు చెందిన వారు ప్రతినెలా 4కి.మీ దూరంలో ఉన్న లక్ష్మాపురం గ్రామానికి వెళ్లి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నారు. ఈ గ్రామాలు మారుమూల ప్రాంతాల్లో ఉండటంతో సరైన రవాణా సౌకర్యం లేక ప్రత్యేకంగా ఆటోల్లో ప్రయాణించి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోందని కార్డుదారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో ఆటోలు కూడా అందుబాటులో ఉండవని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన గ్రామ పంచాయతీల్లో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుప్పెడు బియ్యానికి గంపెడు ఖర్చు..

రేషన్ దుకాణాలు లేని గ్రామాల్లోని ప్రజలు ప్రతినెలా పక్క గ్రామానికి రేషన్ సరుకుల కోసం ప్రత్యేకంగా ఆటోలలో వెళ్లి బియ్యం తెచ్చుకునేందుకు 5, 6 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఆటో చార్జీ రాను,పోను రూ.40 వరకు ఖర్చువుతోంది. ఒక వేళ తీరా రేషన్ దుకాణానికి వెళ్లాకా అక్కడ సిగ్నల్స్ లేకపోవడంతో, వేలిముద్రలు పడకపోవడం తదితర సమస్యలతో బియ్యం రాకుంటే మళ్లీ మరుసటి రోజు వెళ్లాల్సి వస్తోందని, అదనపు రవాణా ఖర్చులు అవుతున్నాయని కార్డుదారులు వాపోతున్నారు.

రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి



రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి పక్క గ్రామాలకు వెళ్తూ ఇబ్బందులు పడుతున్నాం. మా గ్రామం నూతన పంచాయతీగా ఏర్పడినా ప్రతినెలా లక్ష్మాపురం గ్రామంలోని రేషన్ దుకాణానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఆటోలో వెళ్లి 20కేజీల బియ్యం తెచ్చుకోవాలంటే ఆటోకు రానుపోను రూ.40 చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నూతన జీపీల్లో కొత్త రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలి.

– ఎస్‌కె.వలీ, శాంతినగర్